క్లుప్తంగా

జీవితంలో యోగా భాగం కావాలి


సదుంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు

సదుం: యోగా నిత్య జీవితంలో భాగం కావాలని ఎంపీడీఓ హరిప్రసాద్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందితో కలిసి బుధవారం యోగాసనాలు వేశారు. యోగాతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, మనదేశంలో పుట్టిన యోగా విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


పలమనేరు బాలికోన్నత పాఠశాలలో..

పలమనేరు: యోగాసనాలు వేస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీతోపాటు మండల కేంద్రంలో మూడు రోజులపాటు యోగా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. పలుశాఖల అధికారులు, యోగా మాస్టర్లు పాల్గొన్నారు.

యోగా శిక్షణ


హాజరైన సచివాలయ ఉద్యోగులు, సంఘమిత్రలు

రొంపిచెర్ల: యోగా శిక్షణ కార్యక్రమాన్ని గ్రామ సచివాలయ ఉద్యోగులు, సంఘమిత్రలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో మూడు రోజుల యోగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. యోగా చేయడం వలన మానసిక ఒత్తిళ్లు, బీపీ, షుగర్ వంటివి దరిచేరవన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు శ్రావణి, రంగారెడ్డి, రసూల్, రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం


సీహెచ్ఓ కాంతమ్మకు శాలువా కప్పి సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

రొంపిచెర్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ కాంతమ్మ సేవలు శ్లాఘనీయమని పీహెచ్‌సీ డాక్టర్ వినయ్ అన్నారు. సీహెచ్ఓ ఉద్యోగ విరమణ పురస్కరించుకుని బుధవారం ఆమెకు వీడ్కోలు సన్మానం చేశారు. డాక్టర్ మాట్లాడుతూ, సీహెచ్‌వో తన సర్వీసులో ఏ మచ్చ పడకుండా పనిచేశారని, ఇలా చేయడం కష్టమని ఆమె సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కరెంటు 'కోతల' బాధ..!

గంగవరం: మండలంలో ప్రజలకు కరెంట్ కోతలతో కష్టాలు మొదలయ్యాయి. కోతల వల్ల సమయానికి పంటలకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే, గ్రామాల్లో ప్రజలకు సమయానికి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. వేళాపాళా లేకుండా కరెంటు కట్ చేస్తుండటం, పలు గ్రామాల్లో రోజూ ఇదే పరిస్థితి ఉండడంతో వినియోగదారులు మండిపడుతున్నారు. దీనిపై విద్యుత్ సిబ్బందికి ఎవరైనా ఫోన్ చేస్తే లైన్ ట్రిప్ అని చెబుతున్నారని, ఇకనైనా కోతలు పెట్టకుండా విద్యుత్ ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రదర్శనలేని సినిమాహాళ్లపై అధికారుల దాడులు


సినిమా హాల్‌లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఇన్బనాథన్

పలమనేరు: రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాల మేరకు పలమనేరులోని నాలుగు సినిమాహాళ్లను స్థానిక తహసీల్దార్ ఇన్బనాథన్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అయితే ఈ సినిమాహాళ్లలో బుధవారం ఎలాంటి షోలు వేయలేదు. దీంతో అక్కడికెళ్లిన అధికారులు టిక్కెట్ ధరలను అధికంగా విక్రయిస్తున్నారా, తినుబండారాల పరిస్థితి, హాళ్లలో శానిటేషన్ తదితరాలను పరిశీలించలేకుండాపోయింది. తనిఖీలకు వచ్చామా, వెళ్లామా? అన్నట్టు సాగింది. అన్నీ బాగానే ఉన్నట్టు జేసీకి నివేదిక పంపినట్టు సమాచారం. ప్రేక్షకులు లేనప్పుడు సినిమా హాళ్లను తనిఖీ చేసి ఏం ప్రయోజనమనే మాట ప్రజలనుంచి వినిపిస్తోంది.

ఏ పని కావాలన్నా ఊరు దాటాల్సిందే..!



నాటి ప్రభుత్వంలో గంటావూరు సచివాలయంలో పౌరసేవల్లో సిబ్బంది



ప్రస్తుతం సేవలందక కల్లాడు వద్ద బోసిపోతున్న సచివాలయాలు, ఆర్‌బీకేలు

- నాడు గడప గడపకే అందిన పలు రకాల సేవలు
- ఇప్పుడు మండల కేంద్రానికి తప్పని పరుగులు
- ఆర్‌ఎస్‌కేలలో రైతులకు అందని విత్తనాలు, ఎరువులు
- ఇకపై రేషన్ సరుకుల కోసం డీలర్ల వద్దకు..
- కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లో పలు సేవలకు మంగళం

పలమనేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజల గడప గడపకు సంక్షేమ పథకాలు, సేవలు అందాయి. ప్రతినెలా ఇంటివద్దకే సామాజిక పింఛన్లు, ఆస్పత్రులో ఉన్నా సరే అక్కడికే వెళ్లి పింఛన్లు ఇచ్చిన వలంటీర్లను చూశాం. ఇక పల్లెల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీ, భూసార పరీక్షలు, సలహాలు–సూచనలు, గ్రామ సచివాలయాల్లోనే ప్రజలకు అందుతున్న సేవలు, ఇంటివద్దకే రేషన్ సరుకులు, 'ఫ్యామిలీ డాక్టర్'తో ఇళ్లముంగిటకే వచ్చి రోగులకు వైద్య సేవలు..ఇలా ఎన్నో సేవలు ప్రజల ముంగిట చేరాయి. దీంతో పాటు ఆయా గ్రామాల్లో కనిపిస్తున్న సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, బాగుపడిన రోడ్లు, జగనన్న పాలవెల్లువ సెంటర్లు..మొదలైనవన్నీ గత ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి నిలువుటద్దం పట్టాయి. కానీ కూటమి ప్రభుత్వం ఈ పారదర్శక, ప్రజారంజక పాలనకు మంగళం పాడింది. ఏ పనులు, సేవలు కావాలన్నా మండల కేంద్రానికి పరుగులు తీయవలసిన పరిస్థితి కల్పించడంతో ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు.పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాలో మొత్తం 287 సచివాలయాలున్నాయి. ఇప్పుడు ఈ సచివాలయాల్లో సిబ్బంది కనిపించడమే కరువవుతోంది.

నాడు జనం ముంగిటే సేవలు

గ్రామ సచివాలయాల్లో 545 పౌరసేవలుండగా ఇందులో 400 వరకూ ప్రజలకు గ్రామాల్లోనే అందేవి. ఏ సేవలు కావాలన్నా సంబంధిత వలంటీర్ ద్వారా ఇళ్లకే అందేవి. 'జగనన్నకు చెబుదాం' ద్వారా గ్రామాల్లో సమావేశాలను నిర్వహించి పలు సమస్యలనూ పరిష్కరించారు.


గతంలో ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్న పింఛన్లు (ఫైల్)



కూర్మాయి వద్ద పింఛన్ల కోసం ఎదురుచూపులు (ఫైల్)

నాడు అలా..ఇప్పుడు ఇలా..

బెడ్‌కే పరిమితమైన రోగుల ఇళ్లకే వెళ్లి గతంలోలా పింఛన్లు ఇస్తున్నా మిగిలిన వారికి సచివాలయం లేదా పంచాయతీ కార్యాలయాల వద్దకు రప్పించి ఇస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాలకు వెళ్లవలసి వస్తోంది. గత పాలనలో రేషన్ సరుకులు ఆయా గ్రామాలకే అందేవి. ఇప్పుడు ప్రభుత్వం మళ్లీ డీలర్ల వ్యవస్థను తీసుకొచ్చింది. ఇప్పుడు గ్రామాల్లోని వెల్‌నెస్ సెంటర్ల వద్ద వైద్య శిబిరాలను నిర్వహించడం లేదు. అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10వేల గౌరవ వేతనం ఇస్తామంటూ చివరకు వలంటీర్ల వ్యవస్థకే రద్దు చేసి వారి కడుపు కొట్టింది. ఇప్పుడు ఏ సేవలు కావాలన్నా ఆయా మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అగత్యం కలిగింది.

నియోజకవర్గ సమాచారం

మొత్తం మండలాలు : పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, వీకోట	ప్రస్తుత జనాభా: 3,50 లక్షల వరకూ	మొత్తం ఓటర్లు 2.70 లక్షలు

నియోజకవర్గంలో సంక్షేమ పథకాలకు రూ. 2,210 కోట్లు	25 రకాల సంక్షేమ పథకాలకు డీబీటీ ద్వారా లబ్ధిదారులకు రూ. 1,615 కోట్లు
నాన్‌డీబీటీ ద్వారా 1.93 లక్షల మందికి రూ. 595 కోట్లు	డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా లబ్ధి రూ. 2,210 కోట్లు
మొత్తం 92 గ్రామ సచివాలయాలకు రూ. 34.95 కోట్లు	88 రైతుభరోసా కేంద్రాలకు రూ. 19.18 కోట్లు
57 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు రూ. 10 కోట్లు	12 పాలసేకరణ కేంద్రాలకు రూ. 4.48 కోట్లు
28 డిజిటల్ లైబ్రరీలకు రూ. 4.48 కోట్లు	నియోజకవర్గంలో 36 కి.మీ మేర 968 రోడ్డు పనులకు రూ. 44.77 కోట్లు

పీఎంజీఎస్‌వై, ఈఏపీ నిధులతో 54 బీటీ, సీసీ రోడ్లకు రూ. 77.56 కోట్లు

రైతన్నలకు తప్పని తిప్పలు



టి.వడ్డూరు ఆర్‌బీకేలో విత్తనాల పంపిణీ (ఫైల్)



వేరుశనగ విత్తనాల కోసం క్యూ (ఫైల్)

రైతులకు గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పంటల సాగుకు సలహాలు–సూచనలు, క్షేత్రస్థాయిలో రైతులకు శిక్షణ, ఉచితపంటల బీమా తదితర సేవలన్నీ అందాయి. తద్వారా 60వేలమందికి పైగా రైతులకు మేలు కలిగింది. నియోజకవర్గంలో రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను రూ.11 కోట్లతో గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లో నిర్మించారు. వీటి ద్వారా 1600మంది రైతులకు లబ్ధి పొందారు. 16 మల్టీపుల్ గోదాములను రూ.6.40 కోట్లతో నిర్మించడంతో వ్యవసాయోత్పత్తులను వీటిల్లో నిల్వ ఉంచుకునే వెసులుబాటు కలిగింది. అంతేకాకుండా పట్టణంలోని వ్యవసాయమార్కెట్ కమిటీలో రూ.50లక్షలతో డా.వైఎస్సార్ అగ్రిల్యాబ్‌ను నిర్మించారు. రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్ కోసం నియోజకవర్గంలో రూ.75కోట్లతో మూడు సబ్‌స్టేషన్లు, రూ.69కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణం సాగుతోంది. ఫలితంగా ఉచిత విద్యుత్‌కు ధోకా లేకుండా పోయింది. కానీ ఇప్పుడు రైతులను పట్టించుకునేవారే లేరు. ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల కోసం పొరుగునే ఉన్న కర్ణాటకకు వెళ్తున్నారు.

పనులన్నీ వదులుకుని రేషన్ కోసం వెళ్లాల..



మా ఊరు అడవిలో ఉంటుంది. ఇక్కడ 120 రేషన్ కార్డులున్నాయి. అందరూ కూలీ పనులు చేసేవారే. రవాణా సౌకర్యాలు లేవు. అప్పుడప్పుడు ఆటోలు లేదా బైక్‌లపై వెళ్లాల్సిందే. మూడున్నర కిలోమీటర్లలోని పరికిదొనలో రేషన్‌షాపు ఉంది. మొన్నటిదాకా గ్రామానికి రేషన్‌బండి వచ్చేది. ఇకపై ఓ పూట కూలి వదులుకొని రేషన్ కోసం పరికిదొనకు వెళ్లకతప్పదు.

పగడాల ఈశ్వరయ్య, మొదుకూరు, చౌడేపల్లి మండలం

సచివాలయం వెళ్లినా ఎవరూ ఉండరు



గతంలో ఏ పనులు కావాలన్నా సచివాలయంలో జరుగుతాఉండె. ఇప్పుడు సచివాలయంలో ఎవరూ పెద్దగా లేరు. అడిగితే సర్వేకెళ్లినారంటున్నారు. దీంతో ఏ పని కావాలన్నా పలమనేరుకెళ్లాలి. ఇంతకు ముందు ప్రజలకు చాలా సౌకర్యంగా ఉండె. ఇప్పుడు తహసీల్దార్ ఆఫీసువద్ద పట్టించుకునేవారేలేరు. మీ–సేవ వద్దకెళితే ఏం మాట్లాడినా డబ్బులివ్వాల్సిందే.

ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్, నక్కపల్లె

ఓ మూట యూరియా కావాలన్నా కర్ణాటకకు పోవాల..



ఇంతకుముందు ఇక్కడి ఆర్‌బీకేలో యూరియా తెచ్చుకునేవాళ్లం. ఇప్పుడు అక్కడ ఏమీ లేవు. దీంతో ముళబాగిల్‌కు వెళ్లి యూరియా తెచ్చుకుంటున్నాం. రానూపోనూ చార్జీలు, లగేజి కలిపి మూటకు రూ.70 దాకా ఎక్కువగా పెట్టాల. అదే మా ఊర్లోనే యూరియా ఉంటే ఈ బాధ లేదుకదా!

మునివెంకటరెడ్డి, జంబుగుండ్లపల్లె, బైరెడ్డిపల్లె మండలం

వీకోటకు పోవాల్సిందే!



ఇంతకుముందంతా వలంటీర్లకు చెబితే అన్ని పనులు చేస్తా ఉంటిరి. ఇప్పుడు వాళ్లు లేరు. సచివాలయాల్లో ఎలాంటి సేవలు లేవు. దీంతో ఇన్‌కం సర్టిఫికెట్ కావాలన్నా వీ.కోటకు పోయి అక్కడ మీ–సేవలో అప్లై చేసుకుని వారికి డబ్బులిస్తే..ఆ తర్వాత అది ఎప్పుడో వస్తుంది. దీంతో చాలా ఇబ్బందిగా మారింది.

–శ్రీనివాసులు, బంగ్లాచేను, వీ.కోట మండలం

పింఛనోళ్లకు ఇక్కట్లు



గత ప్రభుత్వంలో ఎవరైనా ఆస్పత్రిలో ఉంటే సీఎంసీ, పీఈఎస్, బెంగళూరు, తిరుపతి ఆస్పత్రులకు వెళ్లి వలంటీర్లు పింఛను ఇచ్చేవాళ్లు. ఇప్పుడు పింఛను కోసం పంచాయతీ ఆఫీసు లేదా సచివాలయం ముందు కాచుకొని ఉంటే ఇస్తున్నారు. ముందు ఉన్న గడపవద్దకే సేవలు ఇప్పుడు లేవు. దీంతో పింఛనుదారులకు ఇక్కట్లు తప్పలేదబ్బా.

–గోవిందరాజులు, చౌడేపల్లె రోడ్డు, వీకోట మండలం

కూటమి కుట్రలు, దగాపై కలిసికట్టుగా పోరాటం

- ఎమ్మెల్సీ భరత్‌కు పార్టీ అధినేత మార్గదర్శనం


ఎమ్మెల్సీ భరత్‌తో మాట్లాడుతున్న పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి

కుప్పం రూరల్: వై ఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని చిత్తూరు ఎమ్మెల్సీ, కుప్పం ఇన్‌చార్జి భరత్ బుధవారం విజయవాడలోని ఆయన నివాసంలో కలిశారు. కుప్పంలో కూటమి కుట్రలను, కుప్పంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోగా వైఎస్సార్ సీపీ నాయకులను కేసుల పేరిట లొంగదీసుకుంటున్న వైనాన్ని వివరించారు. దీనిపై పార్టీ అధినేత స్పందిస్తూ..ఎవరూ అధైర్యపడొద్దు..కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది..కూటమి కుట్రలు, దగాపై ప్రజల పక్షాన కలిసికట్టుగా పోరాటంతో మళ్లీ అధికారంలోకి వస్తాం.. కేసులను ఎత్తి వేస్తాం.. అని మార్గదర్శనం చేశారని భరత్ అనంతరం నేషనల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో పార్టీ అధినేతతో పాల్గొన్నట్లు పేర్కొన్నారు

ప్రజా సమస్యలపై పోరాటం చేద్దాం


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన పార్టీ నాయకులు

- పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

గుడుపల్లె: ప్రజాప్రతినిధులు ప్రజల పక్షాల నిలబడి సమస్యలపై పోరాటం చేయాలని పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ దిశగా తన సహకారం, అండదండలు పార్టీశ్రేణులకు ఉంటాయని భరోసా ఇచ్చారు. బుధవారం మండలంలోని ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ క్రిష్ణమూర్తితో పాటు పలువురు పార్టీ నాయకులు తిరుపతిలో పెద్దిరెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. మండలంలో చోటుచేసుకుంటున్న పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజా ప్రతినిధులుగా ఉన్నా కూడా గౌరవం లేదన్నారు. గ్రామాలలోని సమస్యలు చెప్పినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని, పదవుల్లో ఉన్నా కూడా ప్రజలకు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఆయన పైవిధంగా స్పందించారు. పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉండి ధైర్యం చెప్పాలన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ప్రజాకంటక పాలన చేస్తోందని, హామీలను నెరవేర్చకుండా దగా చేసిందని ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజా సమస్యలపై పోరాటాలతో పార్టీకి పూర్వ వైభవం తెద్దామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, మండల వైస్ కన్వీనర్ చెన్నారాయన్, యూత్ రవి, నాయకులు ఈశ్వర్, అంగడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రుతుక్రమంలో పౌష్టికాహారం తీసుకోవాలి


యుక్త వయస్సు బాలికలకు రుతుక్రమంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

రొంపిచెర్ల: రుతుక్రమంలో యుక్త వయస్సు బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ అన్నారు. రుతుక్రమంపై యుక్త వయస్సు బాలికలు, తల్లులకు బుధవారం అవగాహన కల్పించారు. బాలికలు పీరియడ్స్ సమయంలో గుడ్డ ముక్కలను వాడరాదని, శానిటరీ నాప్కిన్స్ ఉపయోగించడం శ్రేయస్కరమన్నారు. ఈ సమయంలో సరైనశుభ్రత పాటించకపోతే అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, రుతుక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. వాడిన నాప్కిన్స్‌ను పేపర్లో చుట్టి డస్ట్‌బిన్లలో వేయాలన్నారు. రోజూ రెండుసార్లు స్నానం చేయాలన్నారు. నాప్కిన్స్ ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ వినయ్, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రుతుక్రమంపై అవగాహన ర్యాలీ


అవగాహనా ర్యాలీలో వైద్యాధికారి శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది

గంగవరం: మహిళలకు సంబంధించి రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించినా శుభ్రతపై బుధవారం గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో యుక్తవయస్సు బాలికలు, మహిళలల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని నెలసరి, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని పీర్ ఎడ్యుకేటర్స్‌కు సూచించారు. అనంతరం ప్రభుత్వం అందజేసిన ఉచిత యాప్రాన్, టోపీలను అందజేశారు. వైద్యాధికారి లహరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బైపాస్ నిర్మాణానికి భూములు ఇవ్వండి


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ భవాని

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె సమీపంలో నూతనంగా వేయనున్న బైపాస్ రోడ్డు పనులకు రైతులు సహకరించాలని ఆర్డీఓ భవాని కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. రహదారులు వేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. బైపాస్ నిర్మాణ పనులకు రైతులు భూములు ఇచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో సేకరించిన భూములు సరిపోవడం లేదని, అదనంగా భూములు కావాల్సి వస్తోందన్నారు. ఇందుకు అవసరమయ్యే భూములను సర్వే చేసి రైతులకు తెలియజేస్తామన్నారు. ప్రభుత్వం చెల్లిస్తున్న పరిహారం చాలా తక్కువగా ఉందని, నష్టపరిహారం పెంచి ఇవ్వాలని రైతులు కోరారు. పరిహార విషయంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- **నేడు కాటిపేరిలో ఉచిత వైద్య శిబిరం**

చౌడేపల్లె: మండలంలోని కాటిపేరి పాత గ్రామ సచివాలయ ఆవరణంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సరిత తెలిపారు. తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యనిపుణులు రోగులను పరీక్షిస్తారని చెప్పారు.

- **31న మున్సిపల్ సమావేశం**

పలమనేరు: పలమనేరు మున్సిపల్ సాధారణ సమావేశం ఈనెల 31న చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎక్స్–అఫిషియో సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో ఎన్టీఆర్ జయంతి

పలమనేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు జయంతిని నిర్వహించారు. ఆయన సేవలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం వివరించారు. మరోవైపు ఇదే కార్యక్రమాన్ని పట్టణానికి చెందిన టీడీపీ శ్రేణులు స్థానిక ఏఎంసీ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించాయి. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.